క్లుప్తంగా

అనాథలకు చేయూత



వృద్ధుడికి దుప్పటి అందజేస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పట్టణంలోని అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు శుక్రవారం చేయూత నిచ్చారు. తమవంతుగా దుప్పట్లు, టవళ్లు, ఆహార పదార్థాలు కొనుగోలు చేసి వారికి అందజేశారు. విద్యార్థి దశ నుంచి సేవా భావం అలవర్చుకోవాలన్న ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా హెచ్ఎం లలిత శ్యామల పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ వెంకటరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించకుండా రోడ్లపై నిలిపిన వాహన చోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపుతున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తుందని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంచి ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి

కొలిమిగుండ్ల: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఎస్ఐ రమేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు అందరూ ఉత్తీర్ణులై మండలాన్ని ఆదర్శంగా నిలుపాలని సూచించారు. చదువుకున్న పాఠశాలతో పాటు తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రసేనా రెడ్డి, అధ్యాపకులు గుర్రప్ప, శివలింగారెడ్డి, మధుసూదన్, ప్రసాద్,నిర్మలా ప్రశాంతి,వరలక్ష్మి,అరుణ,చంద్రకళ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప స్వామి తిరునాల

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో వెలసిన బీరప్ప మల్లికార్జునస్వామి తిరునాల మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీరప్ప మల్లికార్జునస్వామిని ప్రత్యేక పుష్పాలంకరణలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చెక్కభజన కార్యక్రమం ఆకట్టుకుంది. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి బీరప్ప మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ



వర్ధినిని అభినందిస్తున్న మంత్రి రోజా

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వర్ధిని జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఇటీవల పంజాబ్ రాష్ట్రంలోలూధియానాలో జరిగిన పోటీల్లో సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌నుంచి వర్ధిని సత్తా చాటి రన్నర్‌గా నిలిచింది. గురువారం విజయవాడలో జరిగిన శాప్‌స్పోర్ట్స్ సమావేశంలో క్రీడాశాఖ మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి వర్ధినిని ప్రత్యేకంగా అభినందించారు.

నేడు గ్రామ పంచాయతీలో వేలం పాటలు

ప్యాపిలి: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఈఓఆర్డీ బాలకృష్ణుడు ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారపు సంత మార్కెట్, దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్, మాంసం మార్కెట్ తదితర అన్ని పద్దులకు ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ. 6,50,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నా రు. వేలం పాటలో పాల్గొనువారు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదన్నారు.

విద్యుదాఘాతంతో పాము మృతి

ప్యాపిలి: ఏనుగుమర్రి గ్రామ శివారు ప్రాంతంలో దాదాపు ఆరు అడుగుల పాము శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్‌పైకి చేరి విద్యుదాఘాతంతో మృతి చెందింది. దీంతో దాదాపు రెండు గంటల పాటు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది వెళ్లి పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్‌పై మృతి చెందిన పామును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



రూ. 48 లక్షలతో నూతనంగా నిర్మించిన కోవెలకుంట్ల బస్టాండ్



మెరుస్తున్న టైల్స్‌తో ఏర్పాటు చేసిన ఫ్లోరింగ్

ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభానికి ముస్తాబు

కోవెలకుంట్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభానికి ముస్తాబు అవుతోంది. గతంలో బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతుండేవి. పెచ్చులూడి పడి ఓ ప్రయాణికుడు మృతి చెందాడు కూడా. అధ్వాన్న స్థితిలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితులను గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పాతబస్టాండ్ స్థానంలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి రూ. 48 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు బస్టాండ్‌ను అన్నిహంగులతో నిర్మించారు. టైల్స్‌తో ఫ్లోరింగ్ వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు ఆర్టీసీ అధికారులు. అన్నివసతులతో బస్టాండ్ నిర్మించడంతో ప్రయాణికులతోపాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే కాటాసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో సుమారు మూడువేల మంది పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ జరగకుండా టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో ఇళ్ల స్థలాలులేని పేదలు ఎందరో ఉన్నారన్నారు. వారందరికీ ఎస్సార్‌బీసీకి చెందిన నిరుపయోగంగా ఉన్న భూములను సేకరించి పంపిణీకి సిద్ధం చేయగా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన దురుద్దేశంతో మాజీ ఎమ్మెల్యే బీసీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. కోర్టులో ఉన్న ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని విన్నవించారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వం మంజూరైన ఇళ్లకు అప్పటి ప్రభుత్వం కేవలం ఒక్క రూపాయి వారి ఖాతాలో వేయడం మూలంగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. మన ప్రభుత్వంలో వారు ఇళ్లు పొందే అర్హతను కోల్పోయారని, పరిష్కార మార్గం చూపాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని సభ దృష్టికి తెచ్చారు.

రాష్ట్రస్థాయి రాతి దూలం పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్దమ్మ దేవర 16 రోజుల పండుగా సందర్భంగా రైతు సంబరాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి పాలపండ్ల వృషభ రాజముల రాతి దూలం పోటీలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓబులరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది నిర్వహించే న్యూ కేటగిరి విభాగం పోటీలకు సంబంధించిన రూ.2.15లక్షల మొత్తాన్ని తానే అందజేస్తామని నిర్వహకులకు హామీ ఇచ్చారు. ఈ పోటీల్లో వివిధ జిల్లా నుంచి మొత్తం 11 జతల వృషభరాజములు పాల్గొన్నాయి. విజేత వృషభరాజముల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ. 20వేలు, రూ.15వేలు, రూ10 వేలు, రూ. 5 వేలను దాత సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మహానందిరెడ్డి, పెద్దశివారెడ్డి, సుబ్బలక్ష్మీరెడ్డి,కానాల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనర్హత వేటు అప్రజాస్వామికం

డోన్ టౌన్: రాహుల్‌గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి భయపడి అప్రజాస్వామిక పద్ధతుల్లో అనర్హత వేటు వేయడం సరికాదని నంద్యాల జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గార్లపాటి మద్దిలేటి, కార్యదర్శి ఉన్నిగోర్ల జనార్దన్ అన్నారు. లోక్ సభ సభ్యత్వంపై అనర్హుడిగా శుక్రవారం ప్రకటించడాన్ని నిరసిస్తూ పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద వారు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదాని అక్రమాలను ప్రశ్నిస్తున్నారని, జోడో యాత్రలో ప్రజల ఆదరణ చూసి బీజేపీ నాయకుల్లో భయం పట్టుకుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుల్లయ్యశెట్టి, శేఖర్‌యాదవ్, వడ్డె రాజశేఖర్, గోపినాథ్‌రావ్, లక్ష్మన్న పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

బేతంచెర్ల: మారుతున్న కాలనుగుణంగా ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ చంద్రమ్మ అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కిట్లును గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్ రావు

అవుకు: వరిపంటలో పురుగుల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ ప్రసాద్ రావు సూచించారు. శుక్రవారం అవుకు పట్టణ సమీపంలోని వరిపంటలు సాగు చేసిన రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వరి సాగు చేసిన పొలాలను పరిశీలించి, రైతులతో పంటల స్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో పురుగుల ఉధ్రుతి గుర్తించేందుకు ఎకరాకు ఆరు లింగాకర్షక బుట్టలను, దీపపు పురుగులను అరికట్టటానికి జిగురు అట్టలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఉమాదేవి, సింధియా, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహం చేసుకున్న యువకుడిపై కేసు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో బాల్య వివాహం చేసుకున్న యువకుడితోపాటు పెళ్లిని ప్రోత్సహించిన వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మౌలానీ తెలిపారు. ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. అవుకు మండలానికి చెందిన ఓ మహిళ భర్త చనిపోవడంతో కొన్ని నెలల క్రితం కోవెలకుంట్లలో నివాసం ఉంటోంది. తన 13 ఏళ్ల కుమార్తెను పట్టణంలోని ఓ పాఠశాలలో ఆరవ తరగతి చదివిస్తోంది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన సాయిబాబా యువకుడు మైనర్ బాలికను గురువారం వివాహం చేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. ఆ శాఖ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి పోలీసుల సహకారంతో అక్కడికి చేరుకుని బాల్య వివాహంపై విచారణ జరిపారు. వివాహం జరిగినట్లు నిర్ధారణ కావడంతో యువకుడితోపాటు పెళ్లికి సహకరించిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. బాలిక మైనర్ కావడంతో కర్నూలు హోంకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

సామూహిక కుంకుమార్చన

అవుకు: తిరుమల తిరమతి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని జూనూతలతో పాటు కొండమనాయునిపల్లెలో మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అదేవిధంగా గోమాతకు పూజలు చేశారు. గోమాతకు పూజలు చేయటం వలన కలిగే పుణ్య ఫలాలను ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి వివరించారు. కార్యక్రమంలో అర్చకులు శేషగిరిరావు, రామసుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు పోరెడ్డి భాస్కర్ రెడ్డి, చల్లా శ్రీనాథ్ రెడ్డి, అక్కసాని సూర్యనారాయణ రెడ్డి, మూరం ప్రకాశ్ రెడ్డి, రామసుబ్బన్న, హరిసర్వోత్తమ రెడ్డి, శివారెడ్డి, బోయనాగేంద్రుడు, రాముడు, వెంటకరమణ, క్రిష్ణుడు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



చెత్త సేకరణపై క్లాప్‌మిత్రలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: గ్రామాల పరిశుభ్రత, ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రిసోర్స్‌పర్సన్ రవిచంద్ర అన్నారు. స్థానిక స్వచ్ఛభారత్ కేంద్ర ఆవరణలో మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని క్లాప్‌మిత్రలకు శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిసోర్స్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ బాలాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన

● సత్తా చాటిన పీఆర్‌పల్లె వృషభాలు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కానాలలో వెలసిన సుంకులమ్మ తిరునాలను పురష్కరించుకుని చేపట్టిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలపదర్శన పోటీలు శుక్రవారం ముగిశాయి. న్యూ కేటగిరి విభాగంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 9 జతల వృషభాలు పాల్గొన్నాయి. ప్యాపిలి మండలం పీఆర్‌పల్లెకు చెందిన శివకోటియాదవ్ వృషభాలు నిర్ణీత ఇరవై నిమిషాల్లో 3,900 అడుగుల దూరం రాతిదూలం లాగి ప్రథమస్థానంలో నిలిచి రూ. 50వేలు కైవసం చేసుకున్నాయి. సంజామల మండలం కానాల గుండం చెన్నారెడ్డి వృషభాలు 3,792 అడుగుల దూరంతో ద్వితీయ, ఉయ్యాలవాడ మండలం తుడమలదిన్నెకుచెందిన పేరెడ్డి సుబ్బారెడ్డి వృషభాలు 3,763 అడుగుల దూరంతో తృతీయ స్థానంలో నిలిచి రూ. 40వేలు, రూ. 35వేలు దక్కించుకున్నాయి. వైఎస్సార్‌జిల్లా కలసపాడు వెంకటరెడ్డి, ఇదే జిల్లా చిన్నకొమ్మెర్లకు చెందిన జయరామిరెడ్డి, ప్యాపిలి మండలం పీఆర్‌పల్లె రాజశేఖర్, ఉయ్యాలవాడ మండలం తుడలమదిన్నెకు చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి వృషభాలు తర్వాతి స్థానాల్లో రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10వేలు, రూ. 5 వేలు గెలుపొందాయి. దాతల సహకారంతో వృషభ రాజముల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు.

మందులు సక్రమంగా వాడితే క్షయ నయం



ర్యాలీని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్

కోవెలకుంట్ల: క్రమం తప్పకుండా మందులు వాడటంతోపాటు డాక్టర్ల సలహాలు, సూచనలు పాటిస్తే క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందని డాక్టర్లు రాబర్ట్‌కెనిడి, కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం స్థానిక సీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బ్యాక్టీరియా ద్వారా క్షయ సోకి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం వ్యాధి లక్షణాలని చెప్పారు. అలాగే మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సీహెచ్‌సీ డాక్టర్లు శ్వేత, సోఫియా, అనిల్, టీబీయూనిట్ సూపర్ వైజర్ పరమేశ్వరరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, గిరిజ, ప్రభావతి, రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రత్తంగా ఉండాలని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని రామక్రిష్ణాపురం సబ్ సెంటర్‌లో జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా క్షయవ్యాధి బాధితులకు డాక్టర్ మౌనిక చేతుల మీదుగా పౌష్టిహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా గళ్ల పరీక్ష చేయించుకుని చికిత్స తీసుకోవాలని కోరారు. అలాగే టంగుటూరు ప్రాథమిక ఆరోగ్యం పరిధిలో ఉన్న సబ్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శివశంకరుడు,డాక్టర్ సోహైల్‌బాబు ఆధ్వర్యంలో జాతీయ క్షయవ్యాధి సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అవుకు: జాతీయ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రం అవుకులో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్షయ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా డాక్టర్లు వినోద్‌కుమార్, యమున వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దానమ్మ, పర్హాన, వెంకటేశ్వరమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక వైద్య సిబ్బంది క్షయ వ్యాధి నిర్మూలనపై శుక్రవారం అవగాహ ర్యాలీ నిర్వహించారు.ఆరు నెలల పాటు చికిత్స అందించడం ద్వారా క్షయ వ్యాధిని నయం చేయవచ్చని ఈ సందర్భంగా వైద్యాధికారి నితీశ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, సిబ్బంది గంగాదేవి, మనోహర్‌రెడ్డి, యశోద తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక

డోన్ టౌన్: క్షయవ్యాధి పట్ల అవగాహన కలిగి ఉంటే త్వరితగతిన నయం చేసుకోవచ్చు అని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్షయ వ్యాధి లక్షణాలు, బాధితులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు సుంకన్న, రమ్యశిల్ప, రాంబాబు, సునిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బేతంచెర్ల: తనను కులం పేరుతో దూషించడంతోపాటు రాళ్లు, రాడ్లతో అగ్రవర్ణాలు దాడిచేసి గాయపరిచారని మండల పరిధిలోని బలపాలపల్లె సర్పంచ్ చిన్నమద్దమ్మ భర్త ఎద్దులన్న పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. సీఐ ప్రియతం రెడ్డి వివరాల మేరకు బలపాలపల్లెలో బీరప్ప మల్లికార్జున స్వామి తిరునాల సందర్భంగా గురువారం రాత్రి అర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన పోలూరు రాఘవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జావ్వాజి వెంకటేశ్వర్లు, కానాల శివారెడ్డి అనే వ్యక్తులు ఏ అధికారంతో అర్కెస్ట్రా ఏర్పాటు చేశాంటూ ఎద్దులన్నతో గొడవ పెట్టుకున్నారు. మా అనుమతి లేకుండా ఏ విధంగా పెట్టావని కులం పేరుతో దూషిస్తూ రాళ్లు, రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఎద్దులన్న ఫిర్యాదు మేరకు పోలూరు రాఘవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జావ్వాజి వెంకటేశ్వర్లు, కానాల శివారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శుక్రవారం పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

అయ్యల చెర్వులో కారు బోల్తా

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన కర్నూలు రహదారిలోని అయ్యల చెర్వులో కారు బోల్తాపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తెలంగాణా రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా, కోసిగి మండలానికి చెందిన ఓ కుటుంబ ఐదుమంది సభ్యులతో యాగంటి ఉమా మహేశ్వర స్వామి దర్శనార్థం బయలు దేరారు. అయ్యల చెర్వు దగ్గర కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కారు బోల్తాపడింది. ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో కారులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఐదు షాపుల్లో చోరీ

డోన్ రూరల్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రెండు షాపులలో, కూరగాయల మార్కెట్ సమీపంలోని మూడు కిరణాం షాపులలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మొత్తం ఐదు షాపులకు సంబంధించి దుండగులు తాళాలు పగులగొట్టారని పోలీసులు తెలిపారు. షాపుల్లో నగదు పోలేదని, దొంగతనాలపై విచారణ చేస్తున్నామని వివరించారు.

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం

కొలిమిగుండ్ల: ముస్లింలకు అత్యంత పవిత్రమైన, సంతోషాలు పంచే నెల రంజాన్. శుక్రవారం నుంచి ఏప్రిల్ 21 వరకు రంజాన్ మాసంగా పేర్కొంటు ముస్లిం మత పెద్దలు నిర్ణయించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు పాటించారు. రంజాన్ మాసం అంతా దానధర్మాలు, ప్రార్థనలతో అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. స్థానిక నూరాన్ మసీదు, అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, కనకాద్రిపల్లె, పెట్నికోట, తిమ్మనాయినపేట, చింతలాయిపల్లె తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ముఖ్యమంత్రికి వాల్మీకుల కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలుపుతున్న వాల్మీకి కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు

డోన్ టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకి సంఘీయుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోతారని వాల్మీకి సంఘం నాయకులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు అన్నారు. శుక్రవారం అంసెబ్లీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు బిల్లు ప్రవేశ పెట్టి పార్లమెంట్ ఆమోదం కోసం పంపడంతో హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు స్థానిక కార్యాలయంలో, కౌన్సిలర్లు మున్సిపల్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాల్లో చేరుస్తామని గత పాలకులు ఎన్నో సార్లు మభ్య పెట్టారని, అయితే ఇచ్చిన మాటకు కట్టుబడి హామీని నెరవేర్చిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో వాల్మీకి సంఘం నాయకుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, కౌన్సిలర్లు సుమలత, వెంకటేశ్వరమ్మ, మేకల రజని, రమాదేవి, లక్ష్మీదేవి, ఆర్టీ రమణ, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి భాస్కర్‌నాయుడు, బుర్రు శ్రీధర్, రాజు, పెద్దయ్య, సురేష్, నాగార్జున, కృష్ణ, హనుమంతు, శ్రీను, ఆర్మీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

28న అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామంలో ఈ నెల 28న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభోత్సవం చేస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రా రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, నూతనంగా నిర్మించిన బస్సు షల్టర్, వాటర్‌ప్లాంట్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాటసాని ప్రారంభోత్సవం చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రీడల్లో పోటీతత్వం ఉండాలి



క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేసిన కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: యువత అన్ని రకాల క్రీడాల్లో పాల్గొనాలని, క్రీడాస్ఫూర్తితో కూడిన పోటీతత్వం ఉండాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్దకుమారుడు దివంతగ కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా మండలంలోని బీరవోలు గ్రామం బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు రూ.30వేల క్రీడా సామగ్రిని కాటసాని ఓబులరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత క్రీడాల్లో తమ ప్రతిభను వెలికి తీయడానికి తనవంతుగా రాష్ట్ర,జిల్లా స్థాయి క్రీడాపోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, నాయకులు బీరవోలు సర్పంచ్ పల్లె నాగేశ్వరరెడ్డి, బెలుం బాల్‌రెడ్డి సుబ్బరాయుడు, పెద్దనారాయణ, శ్రీనివాసరెడ్డి, చిన్ననారాయణ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందజేయాలి

బనగానపల్లె: చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని బనగానపల్లె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాలమ్మ సూచించారు. పోషణ పఖ్వాడా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కైప ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ 0–6 సంవత్సరాలోపు ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న బాలామృతం తప్పనిసరిగా తినిపించాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు, ఆకుకూరలు, వైఎస్సార్‌పోషణ్ కిట్స్, పాలు, గ్రుడ్లలో ఉన్న పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లికార్జుననాయక్, మహిళా పోలీసు మంజుల తదితరులు పాల్గొన్నారు.